క్లుప్తంగా

ముగిసిన వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు



హోమంలో పాల్గొన్న భక్తులు

ఆమనగల్లు: పట్టణంలోని శ్రీ భక్త మార్కండేయస్వామి దేవాలయంలో గత తొమ్మిది రోజులుగా నిర్వహిస్తున్న వారాహిదేవి నవరాత్రి ఉత్సవాలు సోమవారం ముగిశాయి. ఆలయంలో ప్రతిరోజూ అమ్మవారికి ప్రత్యేక అలంకారం ,పూజలు, స్తోత్ర పారాయణం నిర్వహించారు. నవరాత్రి ఉత్సవాల ముగింపు సందర్భంగా ఆలయంలో పూజారులు నాగభూషణస్వామి, శరత్చంద్రల ఆధ్వర్యంలో వారాహి హోమం, కుంకుమార్చన, పుష్పార్చన చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు ఎంగలి బాలకృష్ణ, పలువురు భక్తులు పాల్గొన్నారు.

మంచాలలో మొక్కల పంపిణీ

మంచాల: వన మహోత్సవంలో భాగంగా గ్రామాల్లో మొక్కల పంపిణీ ప్రారంభమైంది. వర్షాలు కురుస్తుండడంతో పంచాయతీ కార్యదర్శులు గ్రామాల్లో ఇంటికి తిరిగి మొక్కలు నాటిస్తున్నారు. సోమవారం మండల కేంద్రంలో కార్యదర్శి రాజ్‌కుమార్ ప్రజలకు మొక్కలు పంపిణీ చేశారు. మండలంలో 23 గ్రామ పంచాయతీలకు మొక్కలు నాటే కార్యక్రమం ప్రారంభించారు. మంచాలలో ఎనిమిది వేల మొక్కలు నాటేందుకు లక్ష్యం నిర్దేశించుకున్నట్లు సెక్రటరీ రాజ్‌కుమార్ తెలిపారు.

ఉపాధ్యాయ వృత్తికి సమాజంలో గౌరవం



ఉపాధ్యాయులను సన్మానించిన లయన్స్ క్లబ్ సభ్యులు

తుర్కయంజాల్: సమాజంలో ఉపాధ్యాయ వృత్తికి ఎనలేని గౌరవం ఉంటుందని లయన్స్ క్లబ్ ఆఫ్ జిల్లా 320సీ జోనల్ చైర్మన్ ఎల్మటి వెంకట్ రెడ్డి అన్నారు. పురపాలక సంఘం పరిధి రాగన్నగూడలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో పనిచేసి బదిలీపై వెళ్తున్న ఆరుగురు ఉపాధ్యాయులను లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో సోమవారం సన్మానించారు. అదేవిధంగా కొత్తగా పాఠశాలకు వచ్చిన ఉపాధ్యాయులకు స్వాగతం పలికారు. కార్యక్రమంలో రాగన్నగూడ లయన్స్ క్లబ్ అధ్యక్షులు భీంరెడ్డి, కోశాధికారి, మాజీ సర్పంచ్ శంకరయ్యగౌడ్, మాజీ అధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, వెంకటేశ్వరరావు, అల్వాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

'రైతులను మోసం చేస్తున్న ప్రభుత్వం'

ఇబ్రహీంపట్నం: రైతులను మరోసారి రేవంత్ రెడ్డి సర్కారు మోసం చేసిందని బీఆర్ఎస్ నేత, ఎంపీటీసీల ఫోరం మాజీ మండల అధ్యక్షుడు ఏనుగు భరత్‌రెడ్డి ఆరోపించారు. సోమవారం ఆయన మాట్లాడుతూ.. ప్రతి రైతుకు రూ.రెండు లక్షల రుణమాఫీ చేస్తామని ఎన్నికల ముందు కాంగ్రెస్ హామీ ఇచ్చిందన్నారు. ఇప్పుడు రుణమాఫీకి రేషన్‌కార్డు తప్పనిసరి అనడం మోసం చేయడమేనన్నారు. రేషన్‌కార్డునే ప్రామాణికంగా తీసుకుంటే చాలామంది రైతులు రుణమాఫీకి అనర్హులౌతారన్నారు.

బదిలీపై వెళ్లిన కానిస్టేబుళ్లకు సత్కారం



కానిస్టేబుల్ రఘును సత్కరిస్తున్న ఎస్‌ఐ వెంకటేశ్

ఆమనగల్లు: స్థానిక పోలీసుస్టేషన్‌లో పనిచేస్తున్న కానిస్టేబుల్ రఘునాయక్ కడ్తాల్ పోలీసుస్టేషన్‌కు, శ్రీశైలం కేశంపేట ఠాణాకు బదిలీ అయ్యా రు. ఈ మేరకు పోలీసుస్టేషన్ ఆవరణలో సోమ వారం జరిగిన వీడ్కోలు సమావేశంలో కానిస్టేబుళ్లను ఆమనగల్లు ఎస్‌ఐ వెంకటేశ్ ఘనంగా సత్కరించారు.కార్యక్రమంలో ఎఎస్‌ఐలు యాద య్య, బాల్‌రెడ్డి, పోలీసులు తదితరులు పాల్గొన్నారు.

డ్రైనేజీ.. ఎందుకింత లేజీ!

- యాచారంలో మురుగునీటి పారుదల అస్తవ్యస్తం
- నిధులు మంజూరు చేయాలని ఎమ్మెల్యేకు కాలనీవాసుల వినతి



యాచారంలో అండర్ డ్రైనేజీ నిర్మాణం కోసం తవ్విన గుంత

యాచారం: అస్తవ్యస్తమైన డ్రైనేజీ వ్యవస్థతో ప్రజలు తీవ్ర అవస్థలు పడుతున్నారు. యాచారం గ్రామంలోని ఎస్‌బీఐ ముందున్న శ్రీసాయినగర్, శ్రీవెంకటేశ్వర కాలనీలవాసులు డ్రైనేజీ కాల్వలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. మండల కేంద్రమైన అయా కాలనీల్లో డ్రైనేజీ నీరు రోడ్లపైనే ఏరులై పారుతుంది. దీంతో దుర్వాసన వ్యాప్తి చెంది, ఫలితంగా దోమలు ప్రబలి అంటు వ్యాధుల బారిన కాలనీవాసులు పడుతున్నారు. కాలనీల్లో డ్రైనేజీ కాల్వలు నిర్మించాలని అనేకసార్లు అధికారులు, ప్రజాప్రతినిధులకు ఫిర్యాదులు చేసిన పట్టించుకునే వారే కరువైయ్యారని వాపోతున్నారు.

పన్నుల వసూల్‌లో ముందు

రెండు కాలనీల్లో పెద్ద, పెద్ద బంగ్లాలు నిర్మించారు. ఇంటి పన్నులు కూడా ఒక్కో ఇంటికి రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు నిర్ధారించబడ్డాయి. రూ.కోట్లు ఖర్చు పెట్టి ఇళ్లు నిర్మించుకున్నా డ్రైనేజీ నీరు మాత్రం ఇంటి ముందే పారడంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. రూ.లక్షలు ఖర్చు చేసి ఇళ్ల ముందు గుంతలు తీసి డ్రైనేజీ నీరు పంపిస్తే కొద్ది నెలలకే అవి నిండి మళ్లీ మురుగు పారుతుంది. పంచాయతీ అధికారులు పన్నుల వసూల్‌కు వస్తే డ్రైనేజీ సమస్య తీర్చండి ముందు, ఆ తర్వాత పన్నులు చెల్లిస్తామని యజమానులు వారిస్తున్న ఉదంతాలున్నాయి.

మరో రూ.30 లక్షలు అవసరం

గత ప్రభుత్వ హయాంలో మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో పక్షం రోజుల కిందట అండర్ డ్రైనేజీ పనులు ప్రారంభించారు. శ్రీవెంకటేశ్వరనగర్, శ్రీసాయినగర్ కాలనీల నుంచి మురుగు నీటిని తరలించాలంటే ఎస్‌బీఐ ముందున్న డ్రైనేజీ కాల్వలో కలపాల్సి ఉంటుంది. అందుకుగాను పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో పనులు ప్రారంభమయ్యాయి. పూర్తిస్థాయిలో సమస్య పరిష్కారం కావాలంటే మరో రూ.30 లక్షల నిధులు మంజూరు చేయాలని ఇటీవల ఆయా కాలనీవాసులు ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డికి వినతిపత్రం అందజేశారు. ఆయన సానుకూలంగా స్పందించి నిర్మాణ పనులకు సంబంధించి నివేదిక ఇవ్వాలని ఎంపీడీఓకి సూచించారు. దీంతో ఆయా కాలనీవాసులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

శాశ్వత పరిష్కారానికి కృషి



యాచారంలోని డ్రైనేజీ సమస్య శాశ్వత పరిష్కారం కోసం కృషి చేస్తున్నాం. గత ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10 లక్షల నిధులతో పనులు ప్రారంభించాం. కాలనీవాసులు ప్రస్తుత ఎమ్మెల్యే మల్‌రెడ్డిని నిధులు కేటాయించాలని కోరారు.ప్రభుత్వం నుంచి నిధులు వస్తే సమస్య పూర్తిగా పరిష్కారం కానుంది.

– నరేందర్‌రెడ్డి, ఎంపీడీఓ యాచారం



కర్ర విరిగిందా.. అంతే!

అసలే వర్షాకాలం.. రెండు మూడు రోజులుగా వరుణుడు జోరుగా కురుస్తున్నాడు. ఇలాంటి సమయంలో విద్యుత్ నిరంతర సరఫరా కోసం అధికారులు అప్రమత్తంగా ఉండాలి. మండలంలోని ఆస్మత్‌పూర్ గ్రామంలో ప్రమాదానికి సూచికగా ట్రాన్స్‌ఫార్మర్ దర్శనమిస్తోంది. ఓ వ్యవసాయ బావి వద్ద ట్రాన్స్‌ఫార్మర్ విద్యుత్ తీగలు అమర్చే ఇనుప కడ్డీకి బదులుగా తాటి కర్రను బిగించారు. దీంతో ఎడతెరని వర్షాలకు ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందని స్థానికులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు.

– మంచాల

గ్రామీణ క్రీడాకారులకు చేయూతనివ్వండి

తలకొండపల్లి: తెలంగాణ సామాజిక స్టూడెంట్ ఆర్గనైజేషన్(టీఎస్ఎస్ఓ)రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మీశ్రీనివాస్ సోమవారం భారత బ్యాడ్మింటన్ మాజీ క్రీడాకారుడు పుల్లెల గోపీచంద్‌ను కలిశారు. గ్రామీణ ప్రాంతాల్లోని విద్యార్థులు, యువత క్రీడల్లో రాణించేలా.. శిక్షణ శిబిరాల ఏర్పాటుకు కృషి చేయాలని కోరారు.



పుల్లెల గోపీచంద్‌తో లక్ష్మీనివాస్

నియోజకవర్గ అభివృద్ధే ధ్యేయం



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి, నాయకులు

- ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి

కడ్తాల్: కల్వకుర్తి నియోజకవర్గాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేయడమే తన లక్ష్యమని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి పేర్కొన్నారు. మండల కేంద్రం సమీపం నుంచి పడకల్‌గేట్ వరకు రూ.14.60 కోట్లతో 9.2 కిలోమీటర్ల మేరకు నిర్మించనున్న బీటీ డబుల్ రోడ్డు నిర్మాణ పనులను అధికారులు, ప్రజాప్రతినిధులతో కలిసి సోమవారం ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నియోజకవర్గంలో తండాలు, మారుమూల పల్లెలకు రహదారుల ఏర్పాటుతో పాటు, మౌలిక వసతుల కల్పనపై ప్రత్యేక దృష్టి సారించినట్లు చెప్పారు. సీఎం రేవంత్‌రెడ్డి నియోజకవర్గంపై ప్రత్యేక దృష్టి సారించినట్లు తెలిపారు. నియోజకవర్గంలో స్కిల్ డెవలప్‌మెంట్ యూనివర్సిటీ ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. అభివృద్ధి సంక్షేమమే ధ్యేయంగా రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రజాపాలన సాగుతుందన్నారు. త్వరలోనే రైతులకు రూ.2 లక్షల పంట రుణాలను ప్రభుత్వం మాఫీ చేయనుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్అండ్‌బీ డీఈఈ సీతరామయ్య, ఏఈ విజయ్, డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ బ్లాక్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్ విండో డైరెక్టర్లు వెంకటేశ్, డాక్టర్ శ్రీను, నాయకులు భాస్కర్‌రెడ్డి, రాములుగౌడ్, యాదగిరిరెడ్డి, వేణుగోపాల్, చందోజీ, అశోక్, తిరుపతిరెడ్డి, ఇక్బాల్‌పాషా, శంకర్‌నాయక్, జహంగీర్‌అలీ, శేఖర్‌గౌడ్, లక్ష్మయ్య, కృష్ణ, లక్ష్మణ్‌నాయక్, రామకృష్ణ, షాబుద్దీన్, ప్రభు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించడమే లక్ష్యం

అంతకుముందు మండల కేంద్రంలో నిర్మించిన కేజీబీవీ పాఠశాలను బుధవారం ప్రారంభించనున్న నేపథ్యంలో ఎంపీడీఓ సుజాత, ఎంఈఓ సర్దార్‌నాయక్, పాఠశాల ఎస్ఓ అనిత, స్థానిక నాయకులతో కలిసి ఎమ్మెల్యే పరిశీలించారు. రాష్ట్రంలో పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు సీఎం రేవంత్‌రెడ్డి కృషి చేస్తున్నారని ఎమ్మెల్యే కసిరెడ్డి నారాయణరెడ్డి అన్నారు. కేజీబీవీ పాఠశాలను ప్రారంభించేందుకు రాష్ట్ర ఐటీ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, ఎక్సైజ్‌శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, నాగర్‌కర్నూల్ ఎంపీ డాక్టర్ మల్లురవి తదితరులు హాజరుకానున్నట్లు తెలిపారు. అసంపూర్తి పనుల కారణంగా కస్తుర్బా పాఠశాల ప్రారంభం ఆలస్యమైందని ఎమ్మెల్యే అన్నారు. దీనిపై బీఆర్ఎస్ నాయకులు అనవసరమైన రాద్ధాంతం చేస్తున్నారని విమర్శించారు.

బాధిత కుటుంబాలకు బాసట

కడ్తాల్: మండలంలోని సలార్‌పూర్ గ్రామానికి చెందిన కర్రె ఎల్లయ్య అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబానికి రాధాకృష్ణ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ దశరథ్‌నాయక్ సోమవారం రూ.ఐదు వేల ఆర్థికసాయం అందించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ సువాలి, మాజీ ఎంపీటీసీ ప్రియారమేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

తలకొండపల్లి: మండలంలోని జంగారెడ్డిపల్లికి చెందిన మహేశ్(26) అనారోగ్యంతో ఇటీవల మృతి చెందాడు. సోమవారం మాజీ జెడ్పీటీసీ ఉప్పల వెంకటేష్, మాజీ ఎంపీపీ తిర్మణి నిర్మలాశ్రీశైలంగౌడ్‌లు బాధిత కుటుంబానికి వరుసగా రూ.మూడు, రూ.రెండు వేల నగదును అందజేశారు.

అర్హులందరూ దరఖాస్తు చేసుకోండి

ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి

యాచారం: ఆరు గ్యారంటీల్లో భాగంగా విద్యుత్ జీరో బిల్లులు, గృహలక్ష్మి తదితర పథకాలకు అర్హులైన వారు దరఖాస్తులు చేసుకోవాలని ఎంపీడీఓ నరేందర్‌రెడ్డి సోమవారం ఓ ప్రకటనలో తెలిపారు. మండలంలోని 24 గ్రామాల నుంచి నేటి వరకు 720 దరఖాస్తులు వచ్చినట్లు చెప్పారు. మండల పరిషత్ కార్యాలయ సమావేశం హాల్‌లో ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసినట్లు ఆయన వివరించారు. అర్హులైన పేదలు ప్రజాపాలనలో దరఖాస్తులు చేసుకోవాలని సూచించారు. ప్రత్యేక సిబ్బంది వెంటనే ఆన్‌లైన్‌లో నమోదు చేస్తారని తెలిపారు. నిబంధనల ప్రకారం ఆధార్‌కార్డుతో పాటు అన్ని ధ్రువపత్రాలు అందజేయాలని పేర్కొన్నారు.

19న తైబజార్ వేలం

కందుకూరు: కందుకూరు చౌరస్తాలో ప్రతి ఆదివారం నిర్వహించే తైబజార్(వారాంతపు సంత)కు 2024–25 ఏడాదికి సంబంధించి ఈ నెల 19న గ్రామ ప్రత్యేకాధికారిణి బి.సరిత ఆధ్వర్యంలో వేలంపాట నిర్వహించనున్నట్లు పంచాయతీ కార్యదర్శి వి.సురేందర్‌గౌడ్ సోమవారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉ.10.30 గంటలకు నిర్వహించనున్న వేలంపాటలో పాల్గొనదలచిన వారు ముందుగా రూ.10 వేలు చెల్లించి పేరు నమోదు చేసుకోవాలన్నారు.

జీఓ 10ని రద్దు చేయాలి



ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట బైఠాయించిన అంగన్‌వాడీలు

- సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్
- ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం ఎదుట అంగన్‌వాడీల ధర్నా

ఇబ్రహీంపట్నం: స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం(ప్రజాభవన్) ఎదుట జీఓ నంబర్ 10కి వ్యతిరేకంగా అంగన్‌వాడీ టీచర్స్, హెల్పర్స్ యూనియన్ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా చేపట్టారు. ఈ కార్యక్రమానికి సీఐటీయూ జిల్లా కార్యదర్శి చంద్రమోహన్ హాజరై మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అంగన్‌వాడీలకు తీవ్ర అన్యాయం చేసేవిధంగా జీఓ నంబర్ 10ని తీసుకొచ్చిందని ఆరోపించారు. వెంటనే వాటిని రద్దు చేయాలని కోరారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ కింద టీచర్లకు రూ.రెండు లక్షలు, హెల్పర్లకు రూ.లక్ష మాత్రమే ఇస్తుందన్నారు. సగం జీతం ఇచ్చే విధంగా కొత్త జీఓను జారీ చేయాలని డిమాండ్ చేశారు. అదేవిధంగా అంగన్‌వాడీలకు పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యాలను కల్పించి నెలకు రూ.18 వేల వేతనం ఇవ్వాలని ఆయన కోరారు. స్థానిక ఎమ్మెల్యే మల్‌రెడ్డి రంగారెడ్డి కార్యాలయంలో లేకపోవడంతో అక్కడికి వచ్చిన ఇబ్రహీంపట్నం సీడీపీఓ శాంతిశ్రీకి వినతిపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు రాజ్యలక్ష్మి, బాలమణి, వైదేహి, సీఐటీయూ నేతలు కిషన్, ఎల్లేష్, కృష్ణ, చందునాయక్ తదితరులు పాల్గొన్నారు.

అభివృద్ధికి సహకరించాలని వినతి

ఆమనగల్లు: నాగర్‌కర్నూల్ ఎంపీ డా.మల్లురవిని సోమవారం కాంగ్రెస్ మండల మాజీ అధ్యక్షుడు మండ్లి రాములు ఆధ్వర్యంలో నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. హైదరాబాద్‌లోని ఎంపీ నివాసంలో నాయకులు శ్రీనివాస్‌రెడ్డి, మల్లయ్య, మల్లేశ్, రాఘవేందర్‌లు కలిసి పుష్పగుచ్ఛం అందించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా మండల అభివృద్ధికి సహకరించాలని కోరారు.



ఎంపీ మల్లురవికి పుష్పగుచ్ఛం అందిస్తున్న నాయకులు

మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

- సీఐటీయూ ఆధ్వర్యంలో మండలాల్లో నిరసనలు
- పెండింగ్ వేతనాలు, బిల్లులు చెల్లించాలని డిమాండ్



ఇబ్రహీంపట్నం: దీక్షలో మధ్యాహ్న భోజన కార్మికులు

ఇబ్రహీంపట్నం: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలను పరిష్కరించాలని ఇబ్రహీంపట్నం తహసీల్దార్ కార్యాలయం ఎదుట సోమవారం రిలే నిరవధిక దీక్ష చేపట్టారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు కిషన్, జిల్లా సహాయ కార్యదర్శి బ్రహ్మయ్య మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీ మేరకు మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.పదివేల వేతనం ఇవ్వాలని,పీఎఫ్,ఈఎస్ఐ సౌకర్యంతోపాటు యూనిఫాం అందజేయాలన్నారు.పెండింగ్ మెనూ బిల్లులు, వేతనాలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశా రు. కార్యక్రమంలో సీఐటీయూ నేతలు ఎల్లేష్, కృష్ణ, మధ్యాహ్న భోజన కార్మికుల యూనియన్ నాయకురాలు స్వప్న, నిర్మల, హంసమ్మ, ప్రేమలత, మార్తామ్మ తదితరులలు పాల్గొన్నారు.

అక్షయ పాత్రకు అప్పగించరాదు

తలకొండపల్లి: పెండింగ్ వేతనాలు మంజూరు చేయాలని మధ్యాహ్న భోజన కార్మికులు సమ్మె నిర్వహించారు. మండల కేంద్రంలోని ఎమ్మార్సీ కార్యాలయం ఎదుట సోమవారం బైఠాయించారు. జిల్లాలోని 7 మండలాల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయ పాత్రకు ఇచ్చారని, ఆ నిర్ణయాన్ని ఉప సంహరించుకోవాలని కార్మికులు డిమాండ్ చేశారు. నాలుగు నెలల నుంచి జీతాలు రావడం లేదని, తక్షణమే వాటిని మంజూరు చేయాలని కోరారు. కార్యక్రమంలో భోజన కార్మికుల మండలాధ్యక్షురాలు ప్రేమలత, కార్యదర్శి రమాదేవి, సీఐటీయూ ఆమనగల్లు ఏరియా కన్వీనర్ పెంటయ్య, హేమలత, మంజుల, బాలమణి, సావిత్రి తదితరులు పాల్గొన్నారు.

కార్మికులు రోడ్డున పడతారు

కడ్తాల్: సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కేంద్రంలోని విద్యావనరుల కేంద్రం వద్ద మధ్యాహ్న భోజన కార్మికులు సోమవారం నిరవధిక సమ్మె చేపట్టారు.ఈ సందర్భంగా సీఐటీయూ ఏరియా కన్వీనర్ పెంటయ్య మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో మధ్యాహ్న భోజన పథకాన్ని అక్షయపాత్రకు ఇవ్వడంతో 23 ఏళ్లుగా పని చేస్తున్న వారు రోడ్డున పడతారన్నారు. పేద కార్మికుల పొట్టను కొట్టే నిర్ణయాన్ని ప్రభుత్వం వెంటనే ఉపసంహరించుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మమ్మ,వరలక్ష్మీ, బుజ్జమ్మ,వెంకటమ్మ ఉన్నారు.

నాలుగు నెలలుగా ఇబ్బందులు

మాడ్గుల: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలనని సీఐటీయూ మండల ప్రధాన కార్యదర్శి శ్రీలత డిమాండ్ చేశారు. సోమవారం మధ్యాహ్న భోజన కార్మికులతో కలిసి ఎంపీడీఓ కార్యలయం ఎదుట నిరవధిక సమ్మె నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ.. మధ్యాహ్న భోజన కార్మికులకు నాలుగు నెలలుగా వేతనాలు రాలేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెండింగ్ బిల్లులను తక్షణమే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్మికులు రాములమ్మ, వెంకటమ్మ, సోఫియా తదితరులు పాల్గొన్నారు.



మంచాల: మండల కార్యాలయం ఎదుట..



తలకొండపల్లి: సమ్మె చేస్తున్న కార్మికులు



కడ్తాల్: సమ్మెలో పాల్గొన్న కార్మికులు

జీతాలు ఇవ్వకపోవడం దారుణం

మంచాల: పెండింగ్‌లో ఉన్న మధ్యాహ్న భోజన కార్మికుల బిల్లులు చెల్లించాలని సీఐటీయూ మండల కన్వీనర్ పోచమోని కృష్ణ డిమాండ్ చేశారు. సీఐటీయూ ఆధ్వర్యంలో మండల కార్యాలయం ముందు ఎదుట నిరసన వ్యక్తం చేశారు. ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి ఆరు నెలలు దాటిన భోజన కార్మికులకు జీతాలు ఇవ్వక పోవడం దారుణమన్నారు. కార్యక్రమంలో కార్మిక సంఘం నా యకులు సరిత, అలివేలు, జంగమ్మ, యాదయ్య పాల్గొన్నారు.